సాక్షి తిరుపతి

ఆదివారం । 21 । జూలై । 2024



అలిపిరి డ్రైవింగ్ స్కూల్ నం.1

రాష్ట్రంలో అలిపిరి డ్రైవింగ్ స్కూల్ నం.1గా ఉందని ఆర్టీసీ కడప జోన్ ఈడీ గిడుగు వెంకటేశ్వర్లు కొనియాడారు. - 8లో



హత్యా రాజకీయాలు

హత్యా రాజకీయాలు ప్రజాస్వామ్యానికి చెంప పెట్టు అని సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త రాజేష్ ధ్వజమెత్తారు. - 8లో



సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

పాడి రైతు సంక్షేమమే లక్ష్యం



ఇన్‌చార్జి వీసీ డాక్టర్ జేవీ.రమణ

తిరుపతి సిటీ: పాడి రైతు సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తూ వర్సిటీని మరింత అభివృద్ధి పథంలో నడుపుతానని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ జేవీ రమణ తెలిపారు. శనివారం వర్సిటీ పరిపాలన భవనంలో ఆయన ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీలో పశుసంపదను పరిరక్షించడం, పశుసంపద వృద్ధి కోసం పెద్ద ఎత్తున పరిశోధనలు జరుగుతున్నాయని తెలిపారు. బోధన, బోధనేతర సిబ్బంది, అధికారుల సహాయ సహకారాలతో వర్సిటీని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ చెంగల్రాయులు, పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ జపతిరామయ్య, వర్సిటీ డీన్ వీరబ్రహ్మయ్య, నాన్‌టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షులు భరద్వాజ్, అధ్యాపకులు ఆయనను ఘనంగా సన్మానించారు.

మరోసారి తప్పు జరిగితే ఇంటికే



నాయుడుపేట గురుకులంలో కలెక్టర్ వెంకటేశ్వర్

నాయుడుపేట టౌన్: ప్రభుత్వ గురుకులంలో ప్రిన్సిపల్ మొదలుకొని, ఉపాధ్యాయులు, అన్ని విభాగాల అధికారులు విద్యార్థుల పట్ల జాగ్రత్తలు వహించకపోతే ఉపేక్షించేది లేదని కలెక్టర్ వెంకటేశ్వర్ తీవ్రంగా హెచ్చరించారు. పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులంలో కలుషిత ఆహారం తిని సుమారు 150 మందికి పైగా విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో గురుకులంలో జరుగుతున్న మరమ్మతు పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఆరు రోజులుగా పనులు జరుగుతున్నా పురోగతి లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. గురుకులంలో ఎన్నో ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న డారిమ్మెటరీ, తరగతి గదులను కూడా పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలన్నారు. గతంలో మాదిరిగా అపరిశుభ్రంగా ఉంటే సహించేది లేదని హెచ్చరించారు. ముఖ్యంగా వంటశాలతో పాటు డైనింగ్ హాల్ తదితర వాటిని నిశితంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సెక్యూరిటీ గార్డులతో పాటు వాచ్‌మన్‌లు సైతం డ్యూటీలను సక్రమంగా నిర్వహించడం లేదన్నారు. గురుకులంలో ఏదైన సమస్యలు తలెత్తితే అందరినీ ఇంటికి పంపడం ఖాయమని ఆయన హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్, ప్రిన్సిపల్ దాదాపీర్, వార్డన్ విజయభాస్కర్ పాల్గొన్నారు.

తిరుపతి జేసీగా శుభం బన్సల్



తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా శుభం బన్సల్‌ను నియమిస్తూ కూటమి ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. ఈయన గత ఏడాది డిసెంబర్ 23వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 14వ తేదీ వరకు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. మూడు నెలల పాటు జిల్లా జేసీగా పనిచేసిన అనుభవం ఉంది. ప్రస్తుతం ఈయన ఐటీడీఏ సీతంపేట ప్రాజెక్టు ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. 2020 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన ఈయన అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం సబ్‌కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ ఇచ్చారు. అనంతరం తిరుపతి జేసీగా పనిచేశారు. తర్వాత ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌గా పనిచేస్తూ మళ్లీ తిరుపతి జేసీగా బదిలీపై రానున్నారు. ఇదిలావుండగా ప్రస్తుతం జిల్లా జేసీ పనిచేస్తున్న ధ్యాన్‌చంద్రను విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఈ ఏడాది మార్చి 15వ తేదీన తిరుపతిలో బాధ్యతలు చేపట్టిన ఈయన జిల్లా జేసీగా నాలుగు నెలలపాటు పనిచేశారు.

ఆహా కారం!

- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న హోటళ్లు
- లబోదిబోమంటున్న భోజనప్రియులు
- నాసిరకం ఆహారాన్ని అంటగడుతున్న నిర్వాహకులు
- చర్యలకు సిద్ధమవుతున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

- తిరుపతి నగరంలోని బస్టాండ్‌కు సమీపంలో ఉన్న ఒక ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో గత జూన్‌లో అధికారులు దాడులు నిర్వహించారు. అక్కడ పరిశీలించగా.. కుళ్లిన మాంసాహారం, పాచిన వంటలు ఫ్రిడ్జ్‌లో ఉన్నట్టు గుర్తించారు.
- శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమీపంలోని ఓ హోటల్‌లో గత ఏప్రిల్‌లో ఫుడ్‌సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించగా కళ్లు బైర్లుకమ్మే నిజాలు వెలుగు చూశాయి. చట్నీ, సాంబార్ ఫ్రిడ్జిలో నిల్వ చేసి మళ్లీ దాన్ని నార్మల్ టెంపరేచర్‌లో వేడి చేసి వడ్డిస్తున్నట్టు గుర్తించారు.
- గత మేలో రేణిగుంట పరిధిలోని ఒక దాబాలో కలర్ కోటింగ్ వేసి ఫ్రిడ్జ్‌లో నిల్వ ఉంచిన చికెన్ లెగ్ పీస్‌లను, అదేవిధంగా మరిగిన ఆయిల్‌ను ఫుడ్ సేఫ్టీ అధికారులు గుర్తించి కేసులు నమోదు చేశారు.
- తిరుపతినగరంలో గత జూన్‌లో లీలామహల్ సమీపంలోని ఒక హోటల్‌లో బెండకాయ ఫ్రైలో జెర్రి వచ్చింది. కస్టమర్ గొడవకు దిగాడు. విషయం తెలుసుకున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు వడ్డిస్తున్నట్టు గుర్తించారు. తర్వాత ఆ హోటల్‌ను సీజ్ చేసి రూ.50 వేల వరకు జరిమానా విధించారు.
- ఇటీవల పుత్తూరు సమీపంలోని ఒక రెస్టారెంట్లో మూడు రోజులపాటు నిల్వ ఉంచిన మసాలా కలిపిన మాంసాహారాన్ని గుర్తించారు.
- తిరుపతి – చంద్రగిరి మార్గమధ్యంలోని ఒక హోటల్లో నిల్వ ఉంచిన పప్పు, సాంబార్‌ను ఫ్రిడ్జ్‌లో గుర్తించారు. అది రాత్రి చేసిందిగా ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్ధారించారు.



ఇటీవల నాయుడుపేట హోటల్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

ఉరుకులు పరుగుల జీవితంలో చాలామంది బయట ఫుడ్‌కే ప్రాధాన్యమిస్తున్నారు. మరి కొందరు వీకెండ్ సమయాలతో పాటు ఏదో ప్రత్యేక సందర్భంలో హోటల్స్‌కు క్యూ కడుతున్నారు. ఇంకొందరు ఇంట్లో వండుకునేందుకు సమయం ఉన్నా బయట ఫుడ్‌ని తినేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో రెస్టారెంట్లకు భారీగానే గిరాకీ పెరుగుతోంది. ఇంటి ఫుడ్‌ని తీసుకోవడం మాని.. బయట ఫుడ్ లాగించేస్తున్నారు. దీన్ని అవకాశంగా మలుచుకుని హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర తోపుడు బండ్ల నిర్వాహకులు రెచ్చిపోతున్నారు. కుళ్లి, పాచిపోయిన ఆహార పదార్థాలను రోజుల తరబడి ఫ్రిడ్జ్‌ల్లో నిల్వ చేసి తర్వాత దాన్నే వేడిచేసి వడ్డించేస్తున్నారు. దీన్ని గుర్తించక ఆహారప్రియులు ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. బయట దొరికే ఆహారం.. అనర్థాలపై ఓ లుక్కేయండి.

తిరుపతి క్రైమ్: జిల్లాలోని పలు హోటళ్లు నాణ్యత లేని వస్తువులు, పాడైన ఆహార పదార్థాలను వాడుతున్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలో వెల్లడైంది. తిరుపతి నగరంలోని హోటల్స్, రెస్టారెంట్లలో తనిఖీలు చేయగా అసలు విషయం బయటపడింది. కుళ్లిన ఆహార పదార్థాలు వాడడమే కాకుండా ఫుడ్ సేఫ్టీ రూల్స్ కూడా అతిక్రమిస్తున్నట్టు స్పష్టమైంది.

రెండో సారి వేడి చేయడం అనర్థమే

చికెన్..

జిల్లాలో చికెన్ వినియోగం బాగా పెరిగింది. రుచిగా ఉండడంతో వీలు దొరికినప్పుడల్లా లాంగిచేస్తున్నారు. అయితే ఒకసారి తయారు చేసిన చికెన్‌ను మరోసారి వేడిచేసి తినకూడదు. మళ్లీ వేడిచేయడం వల్ల చికెన్‌లో హానికరమైన బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. అలాగే చికెన్‌ను సరిగ్గా నిల్వ చేయకపోయినా చెడిపోతుంది. ఏదైనా బ్యాక్టీరియాను చంపడానికి కనీసం75 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద వేడిచేయాలి. రెండోసారి వేడి చేసిన చికెన్ తింటే అనారోగ్య సమస్యలు తప్పవు.

వంట నూనె

వంట నూనెను మళ్లీ వేడి చేయకూడదు. అలాచేయడం వల్ల ఫ్రీ రాడికల్స్ అనే హార్మ్‌ఫుల్ కాంపౌండ్స్ ఏర్పడతాయి. ఇవి అనేక అనారోగ్య సమస్యలకు దారితీస్తాయి. ఇన్ఫ్లమేషన్, ఆక్సీకరణ ఒత్తిడి వంటి సమస్యలకు కారణమవుతాయి.

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయ్

జిల్లా వ్యాప్తంగా పుట్టగొడుగుల్లా ఆహార పదార్థాల విక్రయ కేంద్రాలు వెలుస్తున్నాయి. చిన్నపాటి జంక్షన్లో కూడా నాలుగైదు తోపుడు బండ్లపై ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. ఒకింత పెద్ద జంక్షన్ అయితే ఏకంగా పదుల సంఖ్యలో ఆ తరహా సెంటర్లు వెలుస్తున్నాయి. అంతేకాకుండా చిన్నపాటి గదులను అద్దెకు తీసుకుని మరీ పకోడి, టిఫిన్ షాపులు, న్యూడిల్స్, పానీపూరి అమ్మకాలు కొనసాగిస్తున్నారు. పెద్దపెద్ద రెస్టారెంట్లు, హోటళ్లు అయితే వేల సంఖ్యలోనే కనిపిస్తున్నాయి.

ఏటా లైసెన్స్‌లు ఎక్కడ?

ప్రభుత్వ నిబంధనల మేరకు ఏడాదిలో రూ.12 లక్షల ఆదాయం వచ్చే హోటళ్లు, రెస్టారెంట్లు రూ.2 వేలు చెల్లించి తమ లైసెన్స్‌లు ఏటా రెన్యూవల్ చేయించుకోవాలి. ప్రస్తుతం అధికారిక సమాచారం మేరకు తిరుపతి జిల్లా పరిధిలో 4,100 మంది మాత్రమే లైసెన్సులు పొందినట్టు తెలుస్తోంది. తద్వారా ప్రభుత్వానికి రూ.34.5 లక్షల ఆదాయం వస్తోంది. ఏడాదిలో రూ.12 లక్షల్లోపు ఆదాయం సంపాదించేచిన్నపాటి దుకాణాలు నిర్వహించే వారు ఏడాదికి రూ.500 చెల్లించి, లైసెన్స్‌లు రెన్యూవల్ చేసుకోవాలి. ఈ లెక్కన కొన్ని వేల షాపులే లైసెన్స్‌లు లేకుండా నిర్వహిస్తున్నట్టు స్పష్టమవుతోంది.

కఠినంగా చట్టాలు

ఆహార భద్రత ప్రమాణాల 2006 సెక్షన్ 37 చట్టం మేరకు కల్తీ ఆహార పదార్థాలను తయారు చేసే వారిని తనిఖీ చేసే పూర్తి బాధ్యతలను ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పగించారు. సెక్షన్ 41 ప్రకారం కల్తీ చేసే వారిపై కేసులు, సీజ్ లాంటి చర్యలు చేపట్టవచ్చు. 2011 నుంచి వివిధ శాఖలకు అనుబంధంగా ఉన్న ఫుడ్ సేఫ్టీని విభజించి ఇతర శాఖలతో సంబంధం లేకుండా ప్రత్యేక ఫుడ్‌సేఫ్టీ విభాగంగా మార్చారు.

జంక్‌ఫుడ్‌తో ఆయుష్షు గోవిందా



- జంక్ ఫుడ్ వంటి ఆహారపదార్థాలపై ఎక్కువ దృష్టి పెడితే రానున్న రోజుల్లో శరీరంలో రోగ నిరోధక శక్తి తగ్గిపోతుంది.
- తద్వారా చిన్న చిన్న జబ్బులు పెద్దగా మారే ప్రమాదం లేకపోలేదు.
- జంక్ ఫుడ్‌లో కొవ్వు అధికంగా ఉండడం వల్ల రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయి పెరుగుతుంది.
- దీని వల్ల గుండె సమస్యలతో పాటు మధుమేహం, రక్తపోటు వ్యాధులు కూడా త్వరగా కనిపిస్తాయి.

వీటికి దూరంగా ఉండండి

- ప్యాక్ చేసిన ఆహారాలకు వీలైనంత దూరంగా ఉండండి. **ఉదాహరణకు:** ప్యాక్ చేసిన స్నాక్స్, బ్రెడ్, పరోటా, టెట్రా ప్యాకెట్లలో లభించే పండ్ల రసం మొదలైనవి.
- నాణ్యత తక్కువగా ఉన్న ఆయిల్ కంటెంట్, కృత్రిమ చక్కెర, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి చాలా ప్రమాదకరం.
- మైదా పిండిని మరే ఇతర ఆహార పదార్థాలలో ఉపయోగించకుండా ఉంటే మంచిది. అలాగే తక్కువ నాణ్యత గల వెన్న, చీజ్ లేదా ఇతర అనారోగ్య పదార్థాలకు దూరంగా ఉండాలి.
- మన శరీర బరువును దృష్టిలో ఉంచుకుని ఆహారం తీసుకోవాలి.
- నూనెలో వేయించిన ఆహారాన్ని నివారించండి. ఆరోగ్యకరమైన, పోషకమైన ఆహారాన్ని తినండి.





ప్రొవిజన్ షాపుల్లో వస్తువులను తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు (ఫైల్)

25 కేసులు

ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతున్న అక్రమ వ్యాపారులకు వ్యతిరేకంగా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. గడిచిన ఏడాది కాలంలో 25 కేసులు నమోదు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. వీటిలో కొన్నింటిని జేసీ కోర్టుకు, మరికొన్నింటిని జిల్లా కోర్టుకు నివేదించినట్టు వెల్లడించారు.

ప్రత్యేక నిఘా



“ఆహారపదార్థాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచారు. అయితే గతంలో 6 నెలలు జైలు శిక్ష ఉండేది. దాన్ని రద్దు చేశారు. వ్యాపార విక్రయాలకు తప్పనిసరిగా లైసెన్స్‌లు పొందాలి. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న హోటల్స్‌పై ఫోకస్ పెట్టాం.

–వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, తిరుపతి జిల్లా

వాస్తవాలు దాచి.. ప్రజలను వంచించి..

- నేతిగుట్లపల్లె ప్రాజెక్టు బాధితులకు పరిహారం ఇవ్వండి
- రైతులకు రూ.1.49 కోట్లు సొంత నిధులు ఇచ్చిన పెద్దిరెడ్డి
- మళ్లీ ఆ కుటుంబంపై నిందలు ఎందుకు ?
- మాజీ ఎంపీ రెడ్డెప్ప ధ్వజం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు : నేతిగుట్లపల్లె ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం తెలుగుదేశం ప్రభుత్వమే చెల్లించాలని, ఇందులో మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, ఎంపీ మిథున్‌రెడ్డికి సంబంధం లేదని చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప స్పష్టం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ నేతిగుట్లపల్లె ప్రాజెక్టును వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించడం జరిగిందన్నారు. దీని ద్వారా సుమారు పదివేల ఎకరాలకు సాగు–తాగునీరు అందేలా ప్రాజెక్టును పూర్తి చేశారన్నారు. బాధితులకు డబ్బులు ఇవ్వాల్సింది ప్రభుత్వమేనని, అయితే ప్రాజెక్టు నిర్మించింది ప్రజల కోసం అని స్పష్టం చేశారు. ప్రాజెక్టు నిర్మాణంతో పెద్దిరెడ్డి కుటుంబానికి మంచి పేరు వస్తుందన్న దురుద్దేశంతో తెలుగుదేశం పార్టీకి చెందిన వారు గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులు వేసి, స్టే తెచ్చి పనులు, నష్టపరిహారం పంపిణీ కాకుండా ఆపేశారని తెలిపారు.

రైతులపై కపట ప్రేమ

ప్రాజెక్టు నిర్మాణం, పరిహారం పంపిణీలో తెలుగుదేశం ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యాన్ని ఆ పార్టీ వారు దాచి పెట్టి, వాస్తవాలు చెప్పకుండా మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేయడం హాస్యాస్పదమని రెడ్డెప్ప ఎద్దేవా చేశారు. తెలుగుదేశం నాయకులకు, ప్రభుత్వానికి రైతులపై ప్రేమ ఉంటే తక్షణమే కేసులు ఉపసంహరించుకుని, రైతులకు డబ్బులు ఇవ్వచ్చు కదా ? అని నిలదీశారు. మాయమాటలతో రైతులపై కపట ప్రేమ చూపవద్దని మండిపడ్డారు.

సొంత నిధుల పంపిణీ..

రిజర్వాయర్ నిర్మాణంలో రైతులు వేసిన పంటలు నష్టపోకుండా సొంత నిధులను పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి పరిహారం కింద రూ.1.49 కోట్లు పంపిణీ చేశారని రెడ్డెప్ప తెలిపారు. ఈ విధంగా రైతులను ఆదుకున్న ఘనత పెద్దిరెడ్డి కుటుంబందేనని కొనియాడారు. పెద్దిరెడ్డి కుటుంబం ప్రజాసేవకే అంకితమని, ప్రజలకు, రైతులకు వారు కోట్లాది రూపాయలు ఆర్థిక సహాయాలు అందించారని తెలిపారు.

పెద్దిరెడ్డిపై నిందలు తగదు

ప్రాజెక్టు బాధితులకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాల్సి ఉంది. కానీ అధికారంలో లేని పెద్దిరెడ్డి కుటుంబం పరిహారం ఇవ్వాలంటూ తెలుగుదేశం వారు నిందలు వేయడం ఏంటని మాజీ ఎంపీ ప్రశ్నించారు. పథకం ప్రకారం తన ఇంటిపై దాడులు చేసి, రైతులు నష్టపరిహారం అడిగేందుకు వచ్చారని తెలుగుదేశం వారు చెప్పడం, తప్పుడు కేసులు పెట్టడం మానుకోవాలన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, తెలుగుదేశం వారికి గుణపాఠం తప్పదని ఆయన హెచ్చరించారు.



పరిహారం ఇవ్వండి

నేతిగుట్లపల్లె రిజర్వాయర్ నిర్మాణానికి మొత్తం 827.23 ఎకరాలు సేకరించారు. ఇందులో 21 బాధిత కుటుంబాలు ఉన్నాయి. రిజర్వాయర్ నిర్మాణం కింద లబ్ధిపొందే వారు 423 మంది రైతులు ఉన్నారు. ఇందులో 407 ఎకరాలు డీకేటీ భూములు ఉన్నాయి. రైతులకు నష్టపరిహారం కింద రూ.54 కోట్లు చెల్లించాలని కాంట్రాక్టర్ సీఎఫ్ఎంఎస్ ద్వారా ప్రభుత్వానికి సమర్పించారు. దానిని విడుదల చేయాల్సింది తెలుగుదేశం ప్రభుత్వం. ఈ డబ్బులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని రెడ్డెప్ప డిమాండ్ చేశారు.

తిరుపతి కమిషనర్‌గా నారపరెడ్డి మౌర్య



తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్య నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి కమిషనర్ అదితిసింగ్ వైఎస్సార్ కడప జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. 2017 బ్యాచ్‌కు చెందిన మౌర్య సివిల్స్‌లో 100వ ర్యాంకు సాధించారు. ఈమె స్వస్థలం వైఎస్సార్ కడప జిల్లా, చాపాడు మండలం, నాగులపల్లి.

25 వరకు డిగ్రీ అడ్మిషన్ల ఆన్‌లైన్ దరఖాస్తు గడువు

తిరుపతి సిటీ: ప్రభుత్వ, ప్రైవేటు, టీటీడీ విద్యాసంస్థల్లో పలు డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. విద్యార్థుల వినతి మేరకు ఇప్పటికే రెండుసార్లు గడువును పొడిగించిన విషయం తెలిసిందే. చివరిసారి గురువారంలోపు ఓఏఎండీసీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, 26 నుంచి 29వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ ప్రక్రియ ఉంటుందని ప్రభుత్వం వెల్లడించింది. 30వ తేదీన ఆప్షన్స్‌లో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని, వచ్చే నెల 3వ తేదీన మొదటి దశ సీట్లు కేటాయింపు ప్రక్రియ పూర్తవుతుందని ఉత్తర్వుల్లో పేర్కొంది.

నానీవన్నీ అవకాశవాద రాజకీయాలే

- ఓటు వేయకపోతే శవాన్ని చూడాలన్నారు
- పదవులు, పనులు అడిగితే ఆత్మహత్య చేసుకుంటా అంటారేమో
- జాతీయ జెండాను ఎగురవేయవద్దని అధికారులకు బెదిరింపులు
- విలేకరుల సమావేశంలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్: పులివర్తి నానివన్నీ అవకాశవాద రాజకీయాలే అని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి విమర్శించారు. తిరుపతిలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పనులు జరగకపోతే పెట్రోలు పోసుకుంటానని, అడిగింది ఇవ్వకపోతే విషం తాగుతానని.. ఎమ్మెల్యే సీటు ఇవ్వకపోతే విషం తాగుతానని చంద్రబాబు, లోకేష్‌ను పులివర్తి నాని బెదిరించారని, ఓటు వేయకపోతే తన శవాన్ని చూడాల్సి వస్తుందని ఓటర్లను బెదిరించారని టీడీపీ నేతలే విమర్శలు చేస్తున్నారని చెవిరెడ్డి గుర్తుచేశారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా నానిని గెలిపించేందుకు చాలా మంది నాయకులు, కార్యకర్తలు కష్టపడ్డారని, అధికారంలోకి వచ్చిన తర్వాత వారు పదవులు, పనులు అడిగితే ఆత్మహత్య చేసుకుంటానని మీ సహజ ధోరణిలో వారిని బెదిరించవద్దని నానికి హితవు పలికారు. మీరు బెదిరిస్తే వారికి ఆత్మహత్యలు చేసుకోవడం తప్ప వేరే మార్గం ఉండదని ఎద్దేవా చేశారు.

ఓటర్ల లిస్టు, తుమ్మలగుంట పార్కుపై విచారణ చేయండి

చంద్రగిరి నియోజకవర్గంలో గత ఎన్నికల ముందు ఓటర్ల జాబితా సంబంధించిన ఫాం–6, ఫాం–7, ఫాం–8లు ఎవరెవరు ఎన్ని నమోదు చేశారు? ఎక్కడెక్కడ నుంచి నమోదు చేశారు? మూడు రోజుల్లో 14 వేల ఫారం–7 ఎవ్వరు పెట్టారు వంటి అంశాలపై పూర్తిస్థాయి విచారణ చేయాలని, దోషులను శిక్షించాలని చెవిరెడ్డి డిమాండ్ చేశారు. ఆమేరకు రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసినట్లు చెప్పారు. అలాగే తుడాలో జరిగిన ప్రతి పనిపై విచారణ జరిపించాలని కోరారు. తన సొంత గ్రామంలో ఉన్న తుమ్మలగుంట పార్కును అభివృద్ధి చేశానని, అది ఎలా తప్పు అవుతుందని చెవిరెడ్డి ప్రశ్నించారు. అభివృద్ధి చేయడమే నేరం అయితే పార్కులో అభివృద్ధిపై కూడా విచారణ చేయాలని కోరారు.

మీ పార్టీ వాళ్లకూ అన్యాయం చేశావు

టీడీపీనే ప్రాణంగా నమ్ముకుని గత 30 ఏళ్లుగా పని చేస్తున్న హేమంబరధరరావు, సుబ్రమణ్యం నాయుడు, నాగరాజునాయుడు, గౌస్‌బాషా, కుమార్ రాజారెడ్డి, ఎర్రావారిపాలెం మధు, చిన్నబాబు, శివకోటిరెడ్డి, రమేష్‌రెడ్డి వంటి వారికి తీవ్ర అన్యాయం చేస్తున్నట్లు అనిపించలేదా.. అని చెవిరెడ్డి నిలదీశారు. వేరే పార్టీ నుంచి వచ్చిన సీఆర్ రాజన్ కన్నా వాళ్లు అసమర్థులుగా ఉన్నారా.. మీ పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి వారిని అర్హత లేని వ్యక్తులుగా భావించినట్లు ఉన్నారని నిలదీశారు. వాళ్లంతా నేడు అవమానభారంతో వేదనతో ఉన్నారని, కనీసం వాళ్లని ఓదార్చాలని కోరారు.

చంద్రగిరిలో.. జాతీయ జెండా ఎగురవేయలేని దుస్థితి

టీడీపీ నేతలకు దేశభక్తి లేదని చెవిరెడ్డి దుయ్యబట్టారు. తుమ్మలగుంట పార్కులో ప్రపంచంలోనే అతిపెద్ద జాతీయ జెండాను 133 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేయడానికి పనులు అన్ని పూర్తి అయ్యాయన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత నాని జాతీయ జెండాను ఎగురవేయవద్దని తుడా అధికారులను బెదిరించినట్లు ఆరోపించారు.

క్లుప్తంగా

22 నుంచి శిక్షా సప్తాహ్

తిరుపతి ఎడ్యుకేషన్ : జాతీయ నూతన విద్యావిధానం 4వ వార్షికోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు వారం రోజుల పాటు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని డీఈఓ, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ వీ.శేఖర్ తెలిపారు. ఇందులో భాగంగా 22న స్థానిక వనరులతో బోధన అభ్యసన సామగ్రిని ఉపాధ్యాయులు తయారుచేసి ప్రదర్శించాలని, 23న పునాది అభ్యసన, సంఖ్యాశాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడానికి సమాజ భాగస్వాములకు అవగాహన కల్పించడం, 24న క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో క్రీడలు, శారీరక సౌష్టవం ప్రాముఖ్యతను తెలిపేలా క్రీడా పోటీలన నిర్వహించడం, 25న సాంస్కృతిక దినోత్సవం సందర్భంగా విద్యార్థుల్లో భిన్నత్వంలో ఏకత్వ భావాన్ని పెంపొందించేలా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం, 26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం సందర్భంగా ప్రస్తుత ఉద్యోగావకాశాల నేపథ్యంలో అన్ని తరగతి గది అనుభవాలను మెరుగుపరచడానికి డిజిటల్ కార్యక్రమాలకు అవసరమయ్యే నూతన నైపుణ్యాల అవసరాన్ని గుర్తించడం, అలాగే నైపుణ్య విద్య, సమర్థమైన, పోటీతత్వ వర్క్ ఫోర్స్‌ను నిర్మించడం, 27న పర్యావరణ పరిరక్షణ సంకల్ప యాత్ర కృత్యాలు, పోషణ దినోత్సవ నిర్వహణ, పాఠశాల్లో కొత్త ఎకో క్లబ్‌ల ఏర్పాటు, వారి తల్లులతో కలిసి 35 మొక్కలను వారితో నాటించడం, 28న సామాజిక భాగస్వామ్య దినోత్సవం సందర్భంగా సహపంక్తి భోజన కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాలను మండల స్థాయిలో ఎంఈఓ–1, 2, సీనియర్ ప్రధానోపాధ్యాయులు, ఇద్దరు పీడీలు, పాఠశాల స్థాయిలో హెచ్ఎంలు, పీడీ, సైన్స్ ఉపాధ్యాయులు పర్యవేక్షించి విజయవంతం చేయాలని డీఈఓ కోరారు.

అలిపిరి డ్రైవింగ్ స్కూల్ నం.1

- 27 బ్యాచ్‌లు పూర్తి
- సర్టిఫికెట్లు అందించిన ఈడీ
- 28వ బ్యాచ్ ప్రారంభం
- జిల్లా వాసులకే శిక్షణ



శిక్షణ పూర్తి చేసుకున్న 27వ బ్యాచ్ డ్రైవర్లతో ఈడీ

తిరుపతి అర్బన్: తిరుపతిలోని అలిపిరి ఆర్టీసీ డిపోలో నడుస్తున్న డ్రైవింగ్ స్కూల్ నం.1 స్థానంలో కొనసాగుతోందని ఆర్టీసీ కడప జోన్ ఈడీ గిడుగు వెంకటేశ్వర్లు కొనియాడారు. శనివారం అలిపిరి డిపోలోని ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కోసం శిక్షణ పూర్తి చేసుకున్న 27వ బ్యాచ్‌కి ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. అంతేకాకుండా 28వ బ్యాచ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వరస్వామి పాదల చెంత అలిపిరి ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పొందిన వారికి విద్యుత్ బస్సుల్లో డ్రైవర్లుగా పనిచేయడానికి అవకాశం ఉందని చెప్పారు. అంతేకాకుండా అలిపిరి స్కూల్‌లో డ్రైవింగ్‌తోపాటు మెకానిజంలోనూ పట్టు సాధించేలా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వం 2020–21 అక్టోబర్ 14వ తేదీన నామమాత్రపు ఖర్చుతో హెవీడ్రైవింగ్ లైసెన్స్‌లు జారీ చేయడానికి ఒక్కో పార్లమెంట్ పరిధిలో ఒక్కో డ్రైవింగ్ స్కూల్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ క్రమంలోనే తిరుపతి అలిపిరి ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ నెలకొల్పినట్టు వెల్లడించారు. అలిపిరి ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపల్, డిపో మేనేజర్ ఎస్.హరిబాబు మాట్లాడుతూ గతంలో అలిపిరి డ్రైవింగ్ స్కూల్‌లో దరఖాస్తులు ఆహ్వానించిన వెంటనే బ్యాచ్‌కి చెందిన 16 మంది భర్తీ అయ్యేవారని, అయితే తాజాగా శిక్షణ పొందడానికి స్థానిక జిల్లా వాసులు మాత్రమే ఉండాలని నిబంధనలు పెట్టడంతో 16 దరఖాస్తులు భర్తీ కావడానికి సమయం పడుతోందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజినీర్ నరసింహులు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పుష్పలత, డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకుడు రాము తదితరులు పాల్గొన్నారు.

కొత్త నిబంధనలతో శిక్షణలో జాప్యం

ఏ జిల్లాకు చెందిన వారు ఆ జిల్లాలోని ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో మాత్రమే హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌కు శిక్షణ పొందాలని కొత్త నిబంధనలు పెట్టారు. దీంతో సీట్లు భర్తీ కాకుండా మిగిలిపోతున్నాయి. ఆర్టీసీతోపాటు ఇతర ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో డ్రైవర్‌గా పనిచేయడానికి తప్పనిసరిగా హెవీ డ్రైవింగ్ లైసెన్స్ అవసరం. ఈ క్రమంలో డ్రైవింగ్ ఫీల్డ్‌లో ఉన్న వారు ప్రైవేటుగా శిక్షణ తీసుకుని హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందడానికి రూ.50వేల నుంచి రూ.70వేల వరకు ఖర్చు చేయాల్సి ఉంది. ఈ క్రమంలో గత ప్రభుత్వం 2020–21లో ఆర్టీసీ నేతృత్వంలో ఒక్కో పార్లమెంట్ పరిధిలో ఒక్కో డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు చేసింది. ఒక్కో బ్యాచ్‌కి 16 మందికి 40 రోజులు శిక్షణ ఇచ్చేవారు. రాష్ట్ర వ్యాప్తంగా 25 ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్స్‌లో ఎక్కడైనా.. ఏ జిల్లా వాసులైనా శిక్షణ పొందే వీలుండేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సోమవారం (ఈనెల 22వ తేదీ)నుంచి 29వ బ్యాచ్‌కి దరఖాస్తులు స్వీకరించడానికి ఆహ్వానించారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 25 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 65,134 మంది స్వామివారిని దర్శించుకోగా 26,100 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.27 కోట్లు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పోలీసుల అదుపులో హంతకుడు?

తిరుపతి క్రైమ్: నగరంలోని రాయల్‌నగర్‌లో సంచలనం సృష్టించిన జయలక్ష్మి(67) హత్య కేసును పోలీసులు శనివారం ఛేదించినట్లు విశ్వసనీయ సమాచారం. గురువారం సాయంత్రం 6.10 గంటల సమయంలో హత్యకు పాల్పడి అదే కుటుంబానికి చెందిన వాహనాన్ని దొంగలించి హంతకుడు పరారయ్యాడు. ఆరు బృందాలుగా ఏర్పడిన పోలీసులు వివిధ ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అదే క్రమంలో హంతకుడు దోచుకెళ్లిన వాహనాన్ని రైల్వే స్టేషన్ సమీపంలోని లగేజీ కౌంటర్ వద్ద యూనివర్సిటీ పోలీసులు శుక్రవారం గుర్తించారు. ఈ నేపథ్యంలో హంతకుడు రైల్లో హైదరాబాద్‌కు పారిపోయినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే సీసీ కెమెరాలు పరిశీలించిన అనంతరం నిందితుడు తిరుమలకు వెళ్లినట్లుగా నిర్ధారణ అయ్యింది. తిరుమలలో పోలీసులు హంతకుడిని అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

విచారణలో ఆసక్తికరమైన విషయాలు

విచారణలో జయలక్ష్మి మనవరాల్ని హంతకుడు శ్రీనివాసు వెంటబడి వేధించేవాడు. దీనిపై మనవరాలు తండ్రికి చెప్పింది. కానీ ఏం కాదులే నేను చూసుకుంటా అని పలుమార్లు ధైర్యం చెప్పి సాధారణంగానే తీసుకున్నాడు. ఇదే క్రమంలో విషయం తెలుసుకున్న జయలక్ష్మి శ్రీనివాసుని గట్టిగా మందలించింది. ఇలా చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బెదిరించింది. దీంతో శ్రీనివాసు జయలక్ష్మి పై పగ పెంచుకున్నాడు. ఇదే క్రమంలో రెండు మూడు రోజుల నుంచి జయలక్ష్మి ఇంటి వద్ద రెక్కీ నిర్వహించాడు. ఒంటరిగా దొరికితే చంపేయాలని భావించినట్టు సమాచారం. ఈ క్రమంలోనే గురువారం ఇంట్లో జయలక్ష్మిని వదిలి కోడలు, ఆమె కుమార్తె బయటికి వెళ్లారు. మరో 15 నిమిషాల్లో చిన్న మనవరాలు స్కూల్ నుంచి వస్తుందని తెలియడంతో గేట్లు అన్నీ తెరిచిపెట్టి వెళ్లిపోయారు. ఇదే అదునుగా భావించిన శ్రీనివాసు వారింట్లో వారికి గుంటూరుకి వెళుతున్నట్లు చెప్పి బ్యాగును సర్దుకుని బయటకు వచ్చాడు. మెయిన్ గేట్ ద్వారా ఇంట్లోకి ప్రవేశించి ఫస్ట్ ఫ్లోర్‌లో ఎవరూ లేకపోవడంతో అక్కడే దుస్తులు మార్చుకున్నాడు. డూప్లెక్స్ హౌస్ కావడంతో సెకండ్ ఫ్లోర్ కెళ్లి అక్కడ ఉన్న జయలక్ష్మిని కత్తితో వెనుక నుంచి బలంగా పొడిచాడు. దీంతో జయలక్ష్మి గట్టిగా కేకలు వేయడంతో బెడ్ రూమ్‌లో ఉన్న చిన్న మనవరాలు గమనించి అడ్డగించే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో శ్రీనివాసు బాలికను గట్టిగా నెట్టడంతో ఫస్ట్ ఫ్లోర్ నుంచి కిందపడి కొద్దిసేపు స్పృహ కోల్పోయింది. తిరిగి జయలక్ష్మి వద్దకు వెళ్లి అక్కడ సమీపంలో ఉన్న వేయింగ్ మిషన్‌తో ముక్కుపై బలంగా బాది చంపినట్టు సమాచారం. ఇంతలో స్పృహ నుంచి కోలుకుని పైకి వచ్చిన చిన్న మనవరాల్ని పెనవేసుకుని మెడపై నాలుగు కత్తిపోట్లు పొడిచినట్లు తెలుస్తోంది. ఇంతలో గట్టిగా కేకలు వేయడంతో అప్పుడే కోడలు, పెద్ద మనవరాలు ఇంట్లోకి వచ్చే ప్రయత్నం చేయగా.. వారిని తప్పించుకొని పారిపోయే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో పెద్ద మనవరాలిని గోడకు బలంగా బాది వారి వద్ద నుంచి ద్విచక్ర వాహన తాళాలను లాక్కొని పరారైనట్లు పోలీస్ విచారణలో తేలినట్లు సమాచారం.

సీసీ కెమెరా, సెక్యూరిటీ అలారంపై ఉచిత శిక్షణ

చంద్రగిరి: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో ఈ నెల 26వ తేదీ(శుక్రవారం) నుంచి 30 రోజుల పాటు పురుషులకు సీసీ కెమెరాలు, సెక్యూరిటీ అలారం, స్మోక్ డిటెక్టర్లపై ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రారంభించనున్నట్టు సంస్థ డైరెక్టర్ పి.సురేష్ బాబు తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాల గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన నిరుద్యోగ పురుషులు అర్హులన్నారు. కనీసం 10వ తరగతి వరకు చదువుకుని ఉండాలని చెప్పారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, రానుపోను ఒక్కసారి బస్సు చార్జీ ఇవ్వడంతో పాటు హాస్టల్ సదుపాయాన్ని కూడా కల్పిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు ఇవ్వనున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాసుపోర్టు సైజు ఫొటోలతో సంస్థకి వచ్చి వారి పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న పురుషులకు హాస్టల్ వసతి అందిస్తామన్నారు. వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11–48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట, చంద్రగిరి. ఫోన్: 79896 80587, 94949 51289, 83091 64644 సంప్రదించాలని కోరారు.

నేడు నవోదయ పరీక్షపై అవగాహన సదస్సు

తిరుపతి ఎడ్యుకేషన్: నవోదయ విద్యాలయాల్లో 2025–26 విద్యా సంవత్సరంలో 6, 9వ తరగతుల్లో ప్రవేశాలకు నిర్వహించనున్న పరీక్షలపై ఆదివారం ఉదయం 10 గంటలకు తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం స్కూల్లో అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఆ మేరకు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం విద్యాసంస్థల అధినేత ఎన్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సదస్సుకు 4, 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొనవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఈ ప్రవేశ పరీక్షపై అవగాహన కల్పించడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేస్తామని వెల్లడించారు. వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సైబర్ క్రైమ్‌పై ప్రత్యేక దృష్టి



కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైమ్: జిల్లాలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు సిబ్బందిని ఆదేశించారు. శనివారం పోలీస్ పరేడ్ గ్రౌండ్ సమీపంలో ఉన్న పోలీస్ కంట్రోల్ రూమ్, సైబర్ సెల్‌ను ఆయన తనిఖీ చేశారు. సైబర్ క్రైమ్ జరిగిన అనంతరం నిమిషాల వ్యవధిలోనే స్పందించి నగదు రికవరీ చేయాలన్నారు. మొబైల్ హంట్ పనితీరు బాగానే ఉందని ప్రశంసించారు. కమాండ్ కంట్రోల్ రూమ్, సైబర్ ఆఫీస్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని చెప్పారు.

జిల్లా వ్యాప్తంగా నాకాబంది

జిల్లా అంతటా ఎస్పీ ఆదేశాల మేరకు నాకాబంది నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని 54 ప్రదేశాలలో వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ రహదారి భద్రత సూత్రాలను నగర వాసులకు సూచించారు. గంజాయి, అక్రమ మద్యం, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే పోలీస్ వాట్సాప్ నం.80999977 సంప్రదించాలన్నారు.

ఘాట్ రోడ్డులో ప్రమాదం



గాయాలతో రోదిస్తున్న క్షతగాత్రులు

తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్‌లోని 18వ మలుపు వద్ద శనివారం ప్రమాదం చోటు చేసుకుంది. ఘాట్ రోడ్ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. మొదటి ఘాట్ రోడ్డులోని 18వ మలుపు వద్ద ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి ద్విచక్ర వాహనం బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. అందులో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. అయితే వీరంతా అక్కడ పనిచేస్తున్న గూర్కా కుటుంబానికి చెందిన వ్యక్తులుగా గుర్తించారు. అయితే అటువైపుగా వస్తున్న జేఈఓ వీరబ్రహ్మం ఈ ప్రమాదాన్ని గమనించి వారిని హుటాహుటిన అంబులెన్స్‌లో తిరుపతి రుయాకు తరలించారు.

22 కిలోల గంజాయి స్వాధీనం

- తమిళనాడుకు చెందిన ముగ్గురు యువకుల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

గూడూరు రూరల్: ఒడిశా నుంచి తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. శనివారం గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమిళనాడులోని నాగపట్నం, మదురై జిల్లాలకు చెందిన రామక్రిష్ణన్, సతీష్‌కుమార్, ముగరన్ ఆనందకుమార్ అక్రమంగా డబ్బు సంపాదించాలనుకున్నారని, ఈ క్రమంలోనే గంజాయిని విక్రయించి సొమ్ము సంపాదించాలని భావించినట్టు తెలిపారు. వారంతా మూడు రోజులు క్రితం ఒడిశా ప్రాంతానికి వెళ్లి అక్కడ గంజాయిని కొనుగోలు చేసి దానిని 10 ప్యాకెట్లుగా చేశారన్నారు. ఆపై ట్రావెల్ బ్యాగులో ఉంచుకుని రైలులో గూడూరు వరకు వచ్చారని చెప్పారు. స్టేషన్లో దిగిన తరువాత చెన్నైకి వెళ్లేందుకు జాతీయ రహదారి వద్దకు ఆటోలో బయలు దేరారు. వీరిపై అనుమానం వచ్చిన రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ తన సిబ్బందితో కలసి పోటుపాళెం క్రాస్ రోడ్డు వద్ద తనిఖీ చేశారు. వారు బ్యాగు వదలి పారిపోయే ప్రయత్నం చేయడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. బ్యాగ్‌ను పరిశీలించగా అందులో 22 కిలోల గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. దీని విలువ సుమారు రూ 2.5 లక్షలు ఉంటుందని తెలిపారు. వారి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లు, రూ 2,050 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆయన వెంట గూడూరు రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐ మనోజ్‌కుమార్ ఉన్నారు.

హత్యా రాజకీయాలు ప్రజాస్వామ్యానికి చేటు

- వినుకొండలో జరిగింది రాజకీయ హత్యే
- ఎంపీపై రాళ్ల దాడి హేయమైన చర్య
- ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి రోడ్డున పడేయడం బాధాకరం

వరదయ్యపాళెం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 40 రోజుల్లోపే రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ప్రత్యర్థులపై దాడులు, హత్యలు, హత్యా ప్రయత్నాలు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ధ్వజమెత్తారు. శనివారం నియోజకవర్గంలోని కేవీబీపురం మండల పర్యటనకు వచ్చిన ఆయన స్థానిక పార్టీ శ్రేణులతో కలసి పాత్రికేయులతో మాట్లాడారు. వినుకొండలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడిని నడిరోడ్డుపై దారుణంగా నరికి చంపడం చూస్తుంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎలా ఉన్నాయో అర్థమవుతోందన్నారు. నెలరోజుల్లో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై కూటమి పార్టీలకు చెందిన వారు దాడులకు తెగబడుతున్నారని, వారి ఆస్తులను ధ్వంసం చేస్తున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని టీడీపీ నాయకులు అమలు చేస్తున్నారని ఆరోపించారు. పుంగనూరులో టీడీపీ నేతల దాడుల్లో గాయపడిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను పరామర్శించడానికి వెళ్లిన ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్పపై రాళ్లదాడి చేయడం అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించారు. ఈ రెండు ఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎంపికైన ఒక పార్లమెంటు సభ్యుడికే రక్షణ కల్పించలేని ఈ ప్రభుత్వం సామాన్యులకు ఏ విధంగా రక్షణ కల్పిస్తుందని నిలదీశారు. నేడు మీ వెనుకుండి దాడులకు ప్రోత్సహించే నాయకులు రేపు ఎవరూ ఉండరని, ఆలోచించుకోవాలని ఆయన హెచ్చరించారు.

ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడం అధికార దుర్వినియోగమే

ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడం రాజకీయ దుర్వినియోగమేనని నూకతోటి రాజేష్ అన్నారు. సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో స్థానికంగా ఉన్న కూటమి నేతల ఒత్తిళ్లతో ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించేందుకు కుట్రలు చేయడం సరి కాదన్నారు. ఆ వ్యవస్థ ప్రారంభం నుంచి అనేక ప్రభుత్వాలు వచ్చినప్పటికీ వారి జోలికి వెళ్లలేదని, అయితే తాజాగా వారిని తొలగిస్తుండడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు.

● వి'శేషాచలం'

అలసట తీర్చుకునే ప్రాంతమే అలిపిరి



పూర్వం రవాణా సౌకర్యాలు అంతగా అభివృద్ధి చెందని కాలంలో తిరుపతి నుంచి తిరుమల పైకి వెళ్లడానికి కేవలం ప్రస్తుతం ఉన్న మెట్ల దారే శరణ్యం. సుధూర ప్రాంతాల నుంచి తిరుమలకు వచ్చే భక్తులు అలిపిరి వద్దకు వచ్చి అక్కడ వున్న సత్రాలలో కొద్ది సేపు సేదతీరే వారు. అక్కడి నుంచి మెట్ల దారి గుండా నడచి వెళ్లే వారు. నడవ లేని వారికి డోలీలు ఉండేవి. వాటిని మనుషులు మోసే వారు. అప్పుడప్పుడే తయారయిన మట్టి రోడ్డు ద్వారా ఎద్దుల బండ్ల మీద కూడా భక్తులు పైకి వెళ్ళేవారు. అలా ఎద్దుల బండ్లను నడిపేవారు తిరుపతిలో ఎక్కువగా ఉండే వారు. వారు నివసించిన ప్రాంతం పేరు బండ్ల వీది అది ఈ నాటికి ఉంది. ఆ విధంగా ఆరోజుల్లో సుదూర ప్రాంతాలనుండి వచ్చే యాత్రీకులు ఈ తిరుమల కొండ పాద బాగాన ఆగి అక్కడ ఉన్న వనరులను ఉపయోగించుకుని అలసట తీసుకునే వారు. అందుకుకే దీనికి అలిపిరి అని పేరు. అలిపిరి అనగా అలసట తీర్చుకునే ప్రాంతం అని అర్థం. అలిపిరి నుంచి తిరుమలకు సుమారు 12 కిలోమీటర్లు ఉంటుంది. నడకదారిలో 3,055 మెట్లు ఎక్కిన తర్వాత భక్తులు తిరుమల చేరుకుంటారు. అలిపిరి మార్గంలో నడచి వేళ్లే భక్తుల సౌకర్యార్థం టీటీడీ 1,500 టికెట్లను మంజూరు చేస్తోంది. –తిరుమల